
సాక్షి
చిత్తూరు
7
సోమవారం । 10 । మార్చి । 2025



శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలకు ఆదివారం వైభవంగా శ్రీకారం చుట్టారు. తొలిరోజు సీతాలక్ష్మణ సమేతంగా కోదండరామస్వామివారు ప్రియభక్తుడు ఆంజనేయునితో కలిసి తెప్పపై కొలువుదీరారు. అశేష భక్తుల గోవిందనామస్మరణల నడుమ పుష్కరిణిలో విహరించారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య జనులను అనుగ్రహించారు. సమస్త లోకాలకు సర్వశుభాలు సిద్ధించాలని ఆశీర్వదించారు. – తిరుమల

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం (సా)	సహర్ మంగళవారం (ఉ)
చిత్తూరు	6-28	5-03
పుంగనూరు	6-30	5-07

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

వండర్ కిడ్.. రికార్డుల మోత


వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డుతో చిన్నారి బాలుడు భువన్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : అతిచిన్న వయస్సులో చిన్నారి భువన్‌రెడ్డి భారతదేశ వండర్ కిడ్‌గా నిలిచి అద్భుతం అనిపించుకున్నాడు. జిల్లాలోని తవణంపల్లి మండలం ఈచనేరి గ్రామానికి చెందిన జగదీశ్‌రెడ్డి, అనూష దంపతుల కుమారుడు భువన్‌రెడ్డి. ఈబాబుకు కేవలం ఒక సంవత్సరం 4 నెలల వయస్సు. తన అసాధరణ ప్రతిభతో 1.5 కి.మీ దూరంను 20 నిమిషాల పాటు నిరంతరాయంగా నడిచి ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో వండర్ కిడ్‌గా నిలిచారు. భారతదేశంలోనే మొదటి చిన్నారిగా ఈ ఘనతను గూగుల్ ఫిట్ యాప్ సైతం ధ్రువీకరించింది. ఆ చిన్నారి తల్లి అనూష తన కుమారుడి ప్రతిభను గుర్తించి నడక నైపుణ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు కృషి చేసింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నిరంతర అభ్యాసం చిన్నారుల విజయానికి ఎంతో ముఖ్యమని భువన్ అతి చిన్న వయస్సులో నిరూపించారు. వండర్ కిడ్‌కు ఇటీవల ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ధ్రువీకరణ పత్రం అందజేసింది. ఇండియన్ వరల్డ్ రికార్డ్ లో పేరు సాధించడంపై పలువురు జిల్లా వాసులు అభినందిస్తున్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు


గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న జిల్లా యువజన అధికారి

చిత్తూరు కలెక్టరేట్ : యువత క్రీడల్లో రాణించాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో క్రీడా పోటీలు నిర్వహించారు. యువత క్రీడల్లో ముందంజలో ఉండాలన్నారు. క్రీడల్లో రాణిస్తే మంచి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. వాలీబాల్ పోటీల్లో సంతపేటకు చెందిన చరణ్ అండ్ టీం ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బ్యాడ్మింటన్ డబుల్ విభాగంలో కుప్పంకు చెందిన రాజు, సతీష్ ప్రథమ స్థానంలో నిలిచారు. వారందరికీ జ్ఞాపికలు , సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ క్రీడాపోటీల్లో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ, నెహ్రూ యువ కేంద్ర గణాంక అధికారి బాబురెడ్డి పాల్గొన్నారు.

భావి భారతావనికి భరోసా


మాట్లాడుతున్న ఎస్‌ఎస్‌యూ వీసీ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ : నూతన జాతీయ విద్యావిధానం భావి భారతావని భవితకు భరోసా కల్పిస్తుందని కేంద్ర విద్యాసంస్థల వీసీలు, మేధావులు తెలిపారు. ఆదివారం తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో నేషల్ ఎడ్యుకేషన్ పాలసీ–2020పై రెండు రోజుల జాతీయ సదస్సు ఆదివారం ప్రారంభమైంది. పలువురు వక్తలు మాట్లాడుతూ విజ్ఞాన పరంపరను జాతీయ విద్యావిధానంలో అనుసంధానించారన్నారు. ఎన్‌ఈపీ విశ్వగురువుగా భారత్ ప్రథమ స్థానంలో నిలుస్తుందని వెల్లడించారు. ప్రపంచస్థాయి పోటీని ఎదుర్కొనే స్థాయిలో సమూల మార్పులు చేయడం హర్షణీయమని కొనియాడారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ లక్ష్మీనివాస్ పాండే, మాజీ వీసీ ప్రొఫెసర్ పరమేశ్వరనారాయణ, సోమనాథ్ వర్సిటీ మాజీ వీసీ అర్కనాథ్ చౌదరి, మాజీ డీన్ ప్రొఫెసర్ రవిశంకర మీనన్, ఢిల్లీ సంస్కృత సంవర్ధన డైరెక్టర్ కిరణ్ సులూజా, ఎస్ఎస్‌యూ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, డీన్ ప్రొఫెసర్ దక్షిణామూర్తి శర్మ, ప్రొఫెసర్ ఆర్‌జీ త్రిపాఠి, ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి పాల్గొన్నారు.

సేవలు.. సర్వేనాశనం



సచివాలయ సిబ్బందిపై ప్రభుత్వం కక్షగట్టింది. వివిధ రకాల సర్వేల పేరుతో నిత్యం వేధింపులకు గురిచేస్తోంది. సెలవు రోజుల్లో సైతం శిక్షణ పేరుతో ముప్పుతిప్పలు పెడుతోంది. అన్ని శాఖల పనులను వారి నెత్తిపైనే రుద్ది పొమ్మనలేక పొగబెడుతోంది. ఈ క్రమంలోనే ప్రజలకు సకాలంలో సేవలు అందకుండా అడ్డుపడుతోంది. ఉన్నత ఆశయంతో ఏర్పాటు చేసిన వ్యవస్థను నీరుగార్చేందుకు యత్నిస్తోంది. ఈ మేరకు సర్కారు నిర్వాకంతో జనం తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్.. మండల కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు. సులభతరంగా అందుతున్న సేవలను దూరం చేశారని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకుల వ్యవహారశైలి మారకుంటే గుణపాఠం తప్పదని హెచ్చరిస్తున్నారు.

- సచివాలయ సిబ్బందిని ముప్పుతిప్పలు పెడుతున్న ప్రభుత్వం
- నాలుగు నెలలుగా 36 రకాల సర్వేలతో ప్రజా సేవకు దూరం
- సమస్యలు తీర్చేవారు లేక కలెక్టరేట్, మండల కార్యాలయాలకు జనం

సాక్షి ప్రతినిధి, తిరుపతి : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా సేవకే పెద్దపీట వేసింది. అందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో 35 శాఖలకు సంబంధించి సుమారు 500 సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రధానంగా పింఛన్, రేషన్ కార్డులు, ఇంటి పట్టాలు, సివిల్ పనులు, వైద్యం, ఆరోగ్యం, రెవెన్యూ సమస్యలు, భూముల సర్వే, శిశు సంక్షేమం, డెయిరీ, పౌల్ట్రీ వంటి అనేక అంశాలకు సంబంధించిన సేవలను ఆయా గ్రామాల్లోనే ప్రజలు వినియోగించుకునే వెసులుబాటు కల్పించింది. అర్జీ పెట్టుకున్న 72 గంటల్లోనే సమస్యను పరిష్కరించాలని స్పష్టంగా ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సచివాలయ సిబ్బందికి తోడుగా వలంటీర్లను నియమించింది. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేసేలా దిశానిర్దేశం చేసింది.

పెరిగిన ఒత్తిడి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సచివాలయ సిబ్బందిపై ఒత్తిడి పెరిగింది. ముఖ్యంగా సర్వే అంటేనే భయపడే దుస్థితి దాపురించింది. తెల్లారితే సర్వే అని మొదలుపెడితే సాయంత్రానికి సర్వర్ డౌన్‌వుతోంది. రాత్రి ఇంటికి వెళ్లే సరికి సొమ్మసిల్లి పడిపోతున్నారు. ఆపై కూడా పంచాయతీ కార్యదర్శులు సర్వేలు చేయాలి. ఎంపీ, ఎమ్మెల్యే పర్యటనకు వస్తే వారి మీటింగ్‌ల నిర్వహణ చూసుకోవాలి.

కత్తిగట్టిన కూటమి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థపై కత్తిగట్టింది. పల్లె పాలనను పూర్తిగా రద్దు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. అందులో భాగంగా తొలుత వలంటీర్లను పక్కనపెట్టేసింది. సచివాలయ సిబ్బందిని పలు సర్వేల పేరుతో వేధిస్తోంది. గతంలోనూ సర్వేలు చేపట్టినప్పటికీ.. పౌరసేవలకు భంగం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకునేవారు. ప్రస్తుతం పౌరసేవలను పూర్తిగా పక్కనపెట్టి 36 రకాల సర్వేలను సిబ్బందికి అప్పగించి ఊరూరా తిప్పుతోంది. సెలవు రోజుల్లోనూ సర్వేలపై శిక్షణ అని పిలిపించుకుంటూ ఇబ్బంది పెడుతోంది. ఈ క్రమంలో అన్ని శాఖలకు సంబంధించిన పనులను తమపై రుద్దుతుండడంపై సచివాలయ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఫలితం ఇదీ..

సర్వేల కారణంగా సిబ్బంది పౌరసేవలకు దూరంగా ఉండాల్సి రావటంతో పశు వైద్యం మూగబోయింది. మహిళా పోలీసులను కూడా సర్వేలకు వాడుకోవడంతో పల్లెల్లో సారా, గంజాయి విక్రయాలతోపాటు బెల్టు షాపులు జోరందుకున్నాయి. సచివాలయ సిబ్బంది సర్వేలకు పరిమితం కావడంతో గ్రామ స్థాయి నుంచి పైస్థాయికి సమాచారం చేరడం లేదు. కీలకంగా పనిచేయాల్సిన డిజిటల్ అసిస్టెంట్‌లు కూడా గట్టిగా సీట్లో కూర్చులేకపోతున్నారు. వారికి సైతం అదనపు పనులు అప్పగించడంతో ప్రజా సేవలు కుంటుపడుతున్నాయి. అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు కూడా పొలం బడిని వదిలేశారు. సచివాలయ సిబ్బందిని ప్రభుత్వం వివిధ శాఖలకు సర్దుబాటు చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

పని చేస్తున్నా.. తప్పని ఫిర్యాదులు

మూలిగే నక్కపై తాటికాయపడ్డట్టుగా తయారైంది సచివాలయ సిబ్బంది పరిస్థితి. సర్వేలు, సొంత పనులు, సేవలు తలనొప్పిని తెచ్చిపెడుతుంటే.. మరో వైపు కూటమి నేతలు మరింతగా ఇబ్బందిపెడుతున్నారు. పని ఒత్తిడితో సతమతమవుతున్న ఉద్యోగులపై కావాలనే ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. తాము చెప్పినట్టు నడుచుకోవడం లేదని జులుం ప్రదర్శిస్తున్నారు. దీంతో ఎవరి మాట వినాలో తెలియక సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు.

జిల్లా సమాచారం

మొత్తం సచివాలయాలు :	612
ఉద్యోగులు :	6,120
సచివాలయాల్లో పౌరసేవలు అందించేప్పుడు కలెక్టరేట్ స్పందనకు వచ్చిన అర్జీలు	
2023 డిసెంబర్ :	383
2024 జనవరి :	757
2024 ఫిబ్రవరి :	806
కూటమి ప్రభుత్వంలో కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలు	
2024 డిసెంబర్ :	874
2025 జనవరి :	607
(రెండు వారాలు గ్రీవెన్స్ జరగలేదు)	
2025 ఫిబ్రవరి :	947

కలెక్టరేట్‌కు వినతుల వెల్లువ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల నుంచి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 70 శాఖలకు సంబంధించి మొత్తం 5,379అర్జీలు వచ్చాయి. ఇందులో కేవలం 1,704 వినతులు మాత్రమే పరిష్కరించారు. మిగిలిన 3,675 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి.. అయితే పలు అర్జీలకు కచ్చితమైన పరిష్కారం లభించక ప్రజలు నిత్యం కలెక్టరేట్ చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయా సచివాలయాల్లోనే సమస్యలు పరిష్కారమయ్యేవని అర్జీదారులు గుర్తుచేసుకుంటున్నారు. ప్రస్తుతం వాటిని నిర్వీర్యం చేయడంతోనే వివిధ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని మండిపడుతున్నారు.


కలెక్టరేట్‌లో తమ సమస్యలు చెప్పుకుంటున్న ఫిర్యాదు దారులు

అట్టహాసంగా ఉద్యోగుల క్రీడా పోటీలు


క్రీడా పోటీల్లో గెలుపొందిన సచివాలయ ఇంజినీరింగ్ ఉద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో ఆదివారం సచివాలయ ఇంజినీరింగ్ ఉద్యోగుల అసోషియేషన్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కప్ క్రీడా పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ గ్రామ, వార్డు సచివాలయాల నుంచి ఇంజినీరింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు. క్రికెట్, వాలీబాల్, క్యారమ్స్, బ్యాడ్మింటన్ క్రీడా పోటీలను నిర్వహించారు. క్రికెట్ పోటీల్లో గంగాధర నెల్లూరు టీం, వాలీబాల్‌లో పుంగనూరు టీం, బాడ్మింటన్‌లో మనోజ్ కళ్యాణ్, భాగ్యరాజ్, జాస్మిన్, రాజేష్, ఏఎస్ వాణి, క్యారమ్స్ పోటీల్లో సృజన, మమత విజేతలుగా నిలిచారు. అనంతరం గెలుపొందిన ఉద్యోగులకు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో పలు మండలాల సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ల అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలాజీ, ప్రధాన కార్యదర్శి మణిమారన్, మీడియా సెక్రటరీ దినేష్ పాల్గొన్నారు.

ఎస్పీ ఆధ్వర్యంలో ఫిర్యాదుల స్వీకరణ

చిత్తూరు అర్బన్ : చిత్తూరు వన్‌టౌన్ పక్కన్న ఉన్న ఆర్ముడు రిజర్వు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 28 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 74,646 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.52 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.

అంగన్‌వాడీలు.. తగ్గేదేలే..


విజయవాడ ధర్నాకు బయలుదేరి వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

– విజయవాడ మహాధర్నాకు తరలి వెళ్లిన కార్యకర్తలు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి టీడీపీ ప్రభుత్వం డిమాండ్లు, హామీలు నెరవేర్చే వరకు ఏ మాత్రం తగ్గేదేలే అంటూ జిల్లాలోని అంగన్‌వాడీలు హెచ్చరిస్తున్నారు. విజయవాడలో నిర్వహిస్తున్న మహాధర్నాను భగ్నం చేసేందుకు ఉన్నతాధికారులు, పోలీసులు విశ్వప్రయత్నాలు చేశారు. అయితే ఆదివారం జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి విజయవాడ ధర్నాకు వేలాదిగా కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ మేరకు సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ.. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు విజయవాడ మహాధర్నాకు తరలివెళ్లారన్నారు. న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతున్న అంగన్‌వాడీలపై కూటమి ప్రభుత్వం ప్రతాపం చూపించడం హేయమైన చర్య అని విమర్శించారు. అంగన్‌వాడీ అసోషియేషన్ జిల్లా కార్యదర్శులు లలిత, షకీలా మాట్లాడుతూ.. 30 ఏళ్లలో అంగన్‌వాడీలకు ఎప్పుడూ 10వ తేదీన ప్రాజెక్టు, సెక్టారు సమావేశాలు పెట్టింది లేదన్నారు. ధర్నాకు వెళ్లకుండా చేసేందుకే కూటమి ప్రభుత్వం ఇలాంటి కుట్రలు చేస్తోందని విమర్శించారు. సమావేశాలకు హాజరుకాని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం అన్యాయమన్నారు. అధికారుల బెదిరింపులకు ఆగిపోయిన కొందరు కార్యకర్తలు కేంద్రాలు తీయకుండా ధర్నాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కారం చేసే దిశగా ఆలోచించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సిఫార్సులకే రుణం

నిరుద్యోగులు స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం అందజేస్తున్న కార్పొరేషన్ రుణాలు పచ్చ నేతలకు ఉపాధిగా మారుతున్నాయి. సిఫార్సు ఉన్నవారికే రుణాలు దక్కుతున్నాయి. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగకపోవడంతో నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారు. రాయితీ రుణం గరిష్ఠంగా రూ.2.50 లక్షలు ఉండడంతో పోటీ అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో పచ్చ నేతలు రంగంలోకి దిగి కమీషన్‌లు దండుకొని ఎంపికలు చేస్తున్నారు. ఫలితంగా అర్హులైన లబ్ధిదారుల ఆశలకు గండికొడుతున్నారు.

- స్థానిక ఎమ్మెల్యేలు టిక్ పెడితేనే అర్హత
- కూటమిలోనూ టీడీపీ విధేయులకే పెద్దపీట
- అర్హులకు మొండిచెయ్యి..పచ్చనేతలకే రుణాలు
- కూటమి పాలనలో కమీషన్లకే ప్రాధాన్యం
- జిల్లాలో 1,979 యూనిట్లకు రూ.47.06 కోట్లు


బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్)

విజయపురం : కూటమి నేతలు ప్రతి అవకాశాన్ని తమ రాబడి పథకంగా మార్చుకుంటున్నారు. చివరకు పేదల స్వయం ఉపాధి కల్పనకు మంజూరు చేస్తున్న రాయితీ రుణాల్లోనూ తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రే వైఎస్సార్‌సీపీకి చెందిన వారికి ఏ పనులు చేయకండని చెప్పడంతో దాన్ని స్థానిక ఎమ్మెల్యేలు తప్పకుండా పాటిస్తున్నారు. కూటమిలోనూ అధికశాతం పోటీ నెలకొనడంతో టీడీపీ విధేయులకే పెద్దపీట వేస్తున్నారు. మంజూరు చేసే ఈ రుణాల్లో రాయితీ గరిష్ఠంగా రూ.2.50 లక్షలు వరకు ఉండడంతో సిఫార్సులతో కమీషన్లు దండుకుంటున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల కార్యాలయ కేంద్రంగా రుణాల మంజూరు ఎంపిక జరుగుతోంది. దరఖాస్తు చేసుకున్న వారికి మచ్చుకు ఇంటర్వ్యూలు నిర్వహించి మమ అనిపిస్తున్నారు. గ్రామ స్థాయి 'పచ్చ'నేతల నుంచి నియోజకవర్గ స్థాయి నేతల వరకు పైరవీలతో పంచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పేరుకే ఇంటర్వ్యూలు..

ప్రభుత్వం పేదలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటోంది. అంతా పారదర్శకమని చెప్పడంతో వేల మంది ఔత్సాహికులు దరఖాస్తు చేసుకున్నారు. ఆయా మండల కేంద్రాల్లో దరఖాస్తుదారులకు ఎంపీడీఓలు, బ్యాంకర్లు కలిసి ఇంటర్వ్యూ ప్రక్రియ పూర్తి చేశారు. ఇంతలో అందరి ఎంపీడీఓలకు ఎమ్మెల్యే కార్యాలయాల నుంచి లబ్ధిదారుల ఎంపిక జాబితా తామే పంపిస్తామని, మీ రు ఎలాంటి ఎంపిక జాబితా తయారు చేయవద్దని ఆదేశాలు వచ్చాయి. వివిధ కార్పొరేషన్ల ద్వారా ఇస్తున్న రాయితీ రుణా లు సిఫార్సు ఉంటేనే దక్కే పరిస్థితి కనిపిస్తోంది. పారదర్శకంగా రుణాలు మంజూరు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ లబ్ధిదారుల ఎంపిక ఇప్పటికే జరిగిపోయిందన్న వాదన గట్టిగా వినిపిస్తోంది. కూటమి ప్రభుత్వంలో యూనిట్ ఏర్పాటుతో సంబంధం లేకుండా కేవలం పార్టీ, కమీషన్లకే ప్రాధాన్యం ఇస్తోంది.

జిల్లా అంతటికీ 1979 యూనిట్లే

జిల్లాలో సుమారు 25 లక్షల మంది జనాభా ఉండగా అందులో నిరుద్యోగులు సుమారు 50 వేలకు పైగా ఉన్నారు. కానీ ప్రభుత్వం ప్రస్తుతం బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ, కుమ్మరి, కాపు వంటి ఎనిమిది కులాల కార్పొరేషన్ల ద్వారా కేవలం 1,979 యూనిట్లే మంజూరు చేసింది.ఆయా యూనిట్లకు సంబంధించి రూ.43.12 కోట్లు కేటాయించింది. ఈ రుణాల కోసం సుమారు 17,918 మంది దరఖాస్తు చేసుకున్నారు.

రాజకీయ ప్రమేయంతోనే..

ప్రస్తుత కూటమి ప్రభుత్వం గతానికి భిన్నంగా సబ్సిడీ రుణాలకు లబ్ధిదారుల ఎంపికను పూర్తిగా రాజకీయం ప్రమేయంతో చేస్తోంది. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల కనుసన్నల్లో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ సాగుతోంది. గ్రామస్థాయి టీడీపీ నేతలు జాబితా తయారు చేస్తున్నారు. కొన్ని లోన్లు తమ అనుచరులకు, మరికొన్ని లోన్లు ముందుస్తు అవగాహన ప్రకారం కమీషన్లు ఇచ్చిన వారికే ఇస్తున్నారు.

అధికారులకు స్వేచ్ఛ లేకుండా పోయింది

గత ప్రభుత్వంలో ఈ తరహా రుణాలు లబ్ధిదారుల ఎంపికకు అధికారులు, బ్యాంకర్లకు పూర్తి స్వేచ్ఛ ఉండేది. ఈ కమిటీలో ఎంపీడీఓ, బ్యాంకర్లు ఉండేవారు. రాజకీయ ప్రమేయం లేకుండా అర్హత ఉన్న వారికి రుణాలు మంజూరు చేసేవారు. ప్రస్తుతం అందుకు భిన్నంగా ఈ ప్రక్రియ జరుగుతోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

సస్యరక్షణతోనే దిగుబడులు


మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి

తవణంపల్లె : మామిడి తోటల్లో రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితేనే అధిక దిగుబడి సాధ్యమవుతుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని జీసీఆర్ ఫుడ్, బేవరీస్ ఫ్యాక్టరీ, అరగొండ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో మామిడిలో పూత నుంచి కోత వరకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. మామిడి తోటల్లో ఆశాజనకంగా పూత వచ్చినప్పటికీ ఆశించిన మేరకు పిందెలు నిలవడంలేదన్నారు. మామిడిలో నాణ్యమైన దిగుబడి సాధించడానికి కాయలకు కవర్లు వాడాలన్నారు. కాయలు వృద్ధి చెందే దశలో తీసుకోవాల్సి జాగ్రత్తలు గురించి వివరించారు. రైతులు మామిడి తోటల్లో జనుము, జీలుగతో పాటు ఉలవలు, అలసందలు సాగు చేసి పూత దశలో దుక్కిలో కలిసే విధంగా దున్నడం వల్ల భూమి సారవంతంగా మారుతుందన్నారు. రైల్వే కోడూరు ఉద్యానకళాశాల ప్రొఫసర్ రామయ్య మాట్లాడుతూ.. మామిడి పంటను ఆశిస్తున్న పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలు గురించి రైతులకు వివరించారు. తేనె మంచు పురుగు, తామర పురుగుల నివారణకు సకాలంలో మందులు స్ప్రే చేయించాలని సూచించారు. అనంతరాజు పేట ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త సందీప్ నాయక్ మాట్లాడుతూ..మామిడిని ఆశించే తెగుళ్లు, యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఏప్రిల్ నెల నుంచి ఎస్సీ, ఎస్టీలు వంద శాతం, ఇతరులకు 90 శాతం రాయితీలో డ్రిప్ ఇరిగేషన్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పండ్లపరిశ్రమల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధనబాబీరెడ్డి, ఫ్యాక్టరీ జీఈఓ విద్యాసాగర్‌రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, హరిరెడ్డి, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గోసంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



నగదు విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన గోసంరక్షణ ట్రస్టుకు ఓ దాత ఆదివారం నగదు విరాళం అందజేశారు. ఐరాల మండలం తిరుమలయ్యగారి పల్లికి చెందిన మేదరమెట్ల మోహన్ నాయుడు తన కుటుంబ సమేతంగా రూ.లక్ష నగదును విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు వారికి దర్శనభాగ్యం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది కోదండపాణి, తదితరులున్నారు.

అగ్నిప్రమాదంలో బొలెరో వాహనం దగ్ధం



పుంగనూరులో అగ్నిప్రమాదానికి గురైన బొలెరో వాహనం

పుంగనూరు : మండలంలోని మేలుందొడ్డి గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో బొలెరో వాహనం దగ్ధమైనట్లు అగ్నిమాపక శాఖ అధికారి సుబ్బరాజు తెలిపారు. గ్రామానికి చెందిన మహేష్ ఇంటి సమీపంలో జీపును పార్కింగ్ చేసి ఉంచాడు. ఆ ప్రాంతంలో చెత్తా చెదారం ఉండి, ముళ్లపొదలు ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టారు. ఈ మంటల్లో జీపు కాలిపోయింది. విషయం తెలిసిన గ్రామస్తులు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

ఉద్యానం.. అధ్వాన్నం

- బోయకొండలో ఎండిపోయిన ఉద్యానవనం
- గత ప్రభుత్వంలో రూ.25 లక్షలతో ఏర్పాటు
- నీరున్నా నిర్వహణ లేక అలంకారప్రాయంగా పార్కు
- ప్రభుత్వ ధనం వృథా అవుతున్నా పట్టింపేదీ?
- ఆందోళన వ్యక్తం చేస్తున్న భక్తులు



బోయకొండ గంగాపురంలో నీరు పట్టకపోవడంతో ఎండిపోయిన మొక్కలు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ తల్లి దర్శనాంతరం చల్లటి వాతావరణంలో సేద తీరుతూ సరదాగా కాసేపు విశ్రాంతితో పాటు స్వచ్ఛమైన గాలిని ఆస్వాదించడం కోసం ఏర్పాటు చేసిన ఉద్యానవనం నేడు ఎండిపోతోంది. దీన్ని గత ప్రభుత్వంలో ఏర్పాటు చేయడమే శాపమా? అంటూ భక్తులు అధికారుల అలసత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పచ్చగా కళకళలాడాల్సిన పార్కు నేడు నిర్వహణ లేక ఎండిపోయింది.

జిల్లాలో రెండో పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగాపురంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ మంత్రి , ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో చుడా నిధుల రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన ఉద్యానవనం ఎండిపోతోంది. భక్తుల సౌకర్యార్థంతో పాటు పచ్చటి వాతావరణాన్ని తలపించేలా ఆలయం చెంత సుమారు 2.50 ఎకరాల విస్తీర్ణంలో అత్యంత సుందరంగా ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. భక్తులు సేద తీరడానికి బెంచీలు, పుట్‌పాత్‌లు సైతం ఏర్పాటు చేశారు. వీటిని గత ప్రభుత్వంలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మార్చి 5వ తేదీ 2024న ప్రారంభోత్సవం చేశారు. ఏడాది గడవక ముందే ఉద్యానవనం అధ్వానమైపోయిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్లు, గడ్డికి నీరు పట్టకపోవడంతో పచ్చదనం లేక ఎండిపోయింది. దీంతో గేటుకు తాళాలు వేశారు. ఉద్యానవనం చెత్త కేంద్రాన్ని తలపిస్తోంది. నిర్వహణ లేక లక్షల రూపాయల ప్రభుత్వ ధనం వృథా అయింది. అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా మారింది.

గత ప్రభుత్వంలో ఏర్పాటు చేయడమే శాపమా?

బోయకొండను గత ప్రభుత్వంలో ఊహించని రీతిలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి చేసి చూపించారు. 30 ఏళ్లలో జరగాల్సిన అభివృద్ధిని మూడేళ్లలో చూపించారు.ఈ క్రమంలో ఏర్పాటు చేసిన పార్కును కనుమరుగు చేయాలనే ఉద్దేశంతో పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయానికి చెందిన సుమారు 10 బోర్లు ఉన్నాయి. నీరు పుష్కలంగా ఉంది. 143 మంది సిబ్బంది ఉన్నా పార్కును ఎండిపోయేలా ఎందుకు చేశారని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

శిలాఫలకానికి పేపరు వేసి అతికించేశారు..

బోయకొండ గంగాపురంలో గత ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయలతో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రారంభోత్సవ సమయంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలకు పేపర్లు అతికించడం, పెయింట్లు వేసి వివరాలు కనపడకుండా చేయడం తగదని భక్తులు మండిపడుతున్నారు. అభివృద్ధిలో పోటీ ఉండాలే కానీ చేసిన అభివృద్ధిని ఇతరులకు తెలియకుండా దాచడం తగదని భక్తులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈఓ ఏమన్నారంటే.......

ఈ విషయమై ఈఓ ఏకాంబరంను వివరణ కోరగా ఉద్యానవనంలో మరమ్మతులకు గురైన పైపులైన్లు, స్ప్రింక్లర్లను పనిచేసేలా చూస్తామన్నారు. ప్రత్యేక పర్యవేక్షణతో ఉద్యానవనాన్ని కాపాడుకుంటామని బదులిచ్చారు. మరి మొత్తం మొక్కలు, గ్రాస్‌లెన్ ఎండిపోయిందని అడగ్గా మాట దాటవేయడం గమనార్హం.



శిలాఫలకాలు కనపడకుండా అతికించిన ప్లాస్టిక్ పేపరు



నీరులేక ఎండిన చెట్లు, కళావిహీనంగా ఉద్యానవనం

హైందవ పరిరక్షణకు కృషి చేయాలి



జిల్లా ప్రతినిధులకు జ్ఞాపికను అందిస్తున్న సభ్యులు

పుత్తూరు : హైందవ పరిరక్షణకు బ్రాహ్మణులందరూ ఐక్యంగా కృషి చేయాలని తిరుపతి జిల్లా బ్రాహ్మణ సంఘం సంక్షేమ సమాఖ్య గౌరవాధ్యక్షుడు ఆలూరు రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం పుత్తూరులోని గాయత్రీ బ్రాహ్మణ భవన్‌లో జిల్లా సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రామశర్మ మాట్లాడుతూ.. త్వరలో అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించనున్న బ్రాహ్మణ సంఘం కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఇటీవల రాయచోటి రాములవారి ఊరేగింపులో అర్చకులపై దురుసుగా ప్రవర్తించిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి పేరరాజుశర్మ వేద పండితులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. చట్ట సభల్లో బ్రాహ్మణులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో పలు బ్రాహ్మణ సంఘాల ప్రతినిదులు అజయ్‌కుమార్, మల్లికార్జునశర్మ, రమేష్ పురోహితులు, విజయ్ కుమార్, బాలాజీ, రమేష్, బాలాజీరావు, కిరణ్, సుజాత, సుమన్ పాల్గొన్నారు.

మానవ హక్కుల రక్షణకు కృషి



విద్యార్థినులకు జ్ఞాపికలు అందిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: దేశంలో బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలబడి మానవహక్కుల పరిరక్షణకు కృషి చేయాలని ఎన్‌హెచ్ఆర్‌సీ చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం తిరుపతిలోని ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ మూడో వార్షికోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హక్కుల ఉల్లంఘనలపై ఎన్‌హెచ్ఆర్‌సీ టీమ్ వెంటనే స్పందిస్తూ బాధితులకు న్యాయం అందిస్తోందన్నారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం విద్యార్థులు, నిపుణులు, మేధావులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం వారికి జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రభాకర్‌రెడ్డి, హ్యూమన్‌రైట్స్ ప్రతినిధులు బుల్లెట్ రవి, భాస్కర్, మేఘన, హరీఫ్, రమేష్ , మణి, శివకృష్ణ, పూర్ణచంద్రా రెడ్డి పాల్గొన్నారు.

చినరాజుకుప్పంలో దారుణ హత్య

- 'నా భర్తను కొట్టి చంపేశారు'
- భార్య ఆక్రందన





మృతుడు మణికంఠ, భార్య జనని

పుత్తూరు : తన భర్తను కొట్టి చంపేశారని, ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలంటూ భార్య ఆక్రందనలతో పుత్తూరు ఆసుపత్రిలో మిన్నంటాయి. పుత్తూరు పట్టణ పరిధిలోని చినరాజుకుప్పం గ్రామంలో ఆదివారం సాయంత్రం గ్రామానికి చెందిన మణికంఠ(29) రక్తపు మడుగులో పడి ఉండడాన్ని గుర్తించిన ఓ మహిళ అరుస్తూ వెళ్లి గ్రామస్తులకు తెలిపింది. వెంటనే గ్రామస్తులు 108కు సమాచారం అందించి పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అప్పుడే పుత్తూరులో బస్సు దిగిన మృతుడి భార్యకు విషయం తెలియడంతో ఆసుపత్రిలో భర్త మృతదేహాన్ని చూసిన ఆమె బోరున విలపించింది. బాధితురాలి కథనం మేరకు వివరాలు... చినరాజుకుప్పం గ్రామానికి చెందిన సుబ్బరాయుడు కుమారుడు మణికంఠ (29)కు తమిళనాడుకు చెందిన వీకేఆర్‌పురం గ్రామానికి చెందిన జననితో ఆరేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి 5 ఏళ్ల కుమారుడు అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో జనని శుక్రవారం కుమారుడ్ని చూడడానికి పుట్టింటికి వెళ్లింది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు పుత్తూరులో బస్సు దిగి గ్రామానికి వెళ్లాల్సి ఉండగా గ్రామస్తులు కనబడి నీ భర్త చనిపోయాడని, పుత్తూరు ఆసుపత్రికి తీసుకొచ్చారని తెలిపారు. ఎందుకు ఎలా అంటూ ఆరా తీయగా మణికంఠ అతడి చిన్నాన్న వెంకటేశులు ఇంట్లో రక్తపు మడుగులో పడి ఉండడాన్ని చూసి తెలిపారని చెప్పారు. ఎవరు, ఎందుకు, ఎలా చంపేశారో తెలియదని, దీనిని పోలీసులే తేల్చి, దోషులను కఠినంగా శిక్షించాలంటూ బాధితురాలు జనని ఆక్రోశించింది. మణికంఠ తిరుపతిలోని మహర్షి అభ్యుదయ సేవా సమితిలో పని చేస్తుండగా జనని ప్రస్తుతం గర్భిణి. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.



డయాబెటిక్ సెంటర్‌లో అగ్నిప్రమాదం







డయాబెటిక్ సెంటర్‌లో కాలిపోయిన ఫైల్స్, అగ్నిప్రమాదం జరిగిన డయాబెటిక్ సెంటర్, మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఉన్న ఎస్‌వీఆర్ డయాబెటిక్ సెంటర్‌లో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరగడంతో మంటలు వ్యాప్తి చెందాయి. ఈ విషయాన్ని అక్కడి స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపు చేశారు. కాగా ఆ సెంటర్‌లోని వస్తువులు, ఫైల్స్ కాలిపోయాయి. అయితే ఈ ప్రమాదంలో లక్ష రూపాయల మేర నష్టం జరిగి ఉండవచ్చని అగ్నిమాపక శాఖ అధికారులు వెల్లడించారు. ఈ రెస్క్యూలో జిల్లా అడిషనల్ అగ్నిమాపక శాఖ అధికారి కరుణాకర్, అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల బీభత్సం

బంగారుపాళెం : మండలంలోని అటవీ సరిహద్దు గ్రామాలైన పులిమడుగు, శ్రీనివాసపురం గ్రామాల్లో శనివారం రాత్రి పంట పొలాలను ఏనుగులు ధ్వంసం చేశాయి. రైతులు వేలు, శ్రీను, బాలాజీ, మురుగన్‌కు సంబంధించిన రాగి, వరి, టమాట పంటను నాశనం బాధితులు వాపోయారు. ఏనుగుల రాకను గుర్తించిన రైతులు కేకలు వేసి డప్పులు కొట్టడంతో అడవిలోకి వెళ్లిపోయాయన్నారు. నాలుగు రోజులుగా రైతుల పొంట పొలాలపై ఏనుగులు దాడులు చేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

అష్ట కష్టాలు పడి, అప్పులు చేసి సాగు చేసిన పంటలు చేతి కందే సమయంలో ఇలా పంటలు నాశనం అవుతున్నాయని వాపోయారు. ఏనుగు దాడుల్లో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. పంట పొలాలపైకి ఏనుగులు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు.



వరి మడిని ధ్వంసం చేసిన ఏనుగులు

ఇద్దరు కూలీల మృతి



మృతి చెందిన యేసు

బైరెడ్డిపల్లె : హంద్రీనీవా కాలువ పనుల నిమిత్తం వలస వచ్చిన ఇద్దరు కూలీలు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఖమ్మం జిల్లా సత్యపల్లి గ్రామానికి చెందిన యేసు (52) కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని కామిదొడ్డి గంగమ్మ ఆలయం సమీపంలో జరుగుతున్న హంద్రీనీవా పనుల నిమిత్తం స్వగ్రామం నుంచి వలస వచ్చారు. యేసు తరచూ మద్యం తాగడంతో మత్తులోనే మృతి చెందాడు. ఏలూరు జిల్లా నరసాపురం మండలంలోని కొమ్మగూడెంకు చెందిన వరలక్ష్మి (40) జ్వరంతో మృతి చెందింది. వరలక్ష్మికి ఎవరూ లేకపోవడంతో వలస కూలీలు దహన క్రియలు చేశారు. ఇక యేసు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు. యేసుకు భార్య, కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

24 మద్యం బాటిళ్ల స్వాధీనం

తవణంపల్లె : మండలంలోని పుణ్యసముద్రం- నర్తపుచేను రోడ్డులో షాపులో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తవణంపల్లె ఎస్ఐ చిరంజీవి తెలిపారు. పుణ్యసముద్రానికి చెందిన సుకుమార్ మద్యం బాటిళ్లను అధిక రేట్లతో విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో ఆదివారం సిబ్బందితో దాడి చేసినట్లు వివరించారు. షాపులో 24 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని సుకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

సదుం : సారా కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ షేక్‌షావలి ఆదివారం తెలిపారు. మండలంలోని 79 ఏ చింతమాకులపల్లెకు చెందిన నరసింహులు తన ఇంటి వెనుక వైపున సారా విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. నిందితుడి వద్ద 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకు న్నామన్నారు. అతడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఒంటరి ఏనుగు హల్ చల్

- ఇద్దరిపై దాడి
- ఒకరికి తీవ్ర గాయాలు

యాదమరి (కాణిపాకం) : మండలంలోని దళావాయి గ్రామం వద్ద ఆదివారం రాత్రి ఒంటరి ఏనుగు హల్ చల్ చేసింది. ఆ మార్గంలో వెలుతున్న ఇద్దరిని తీవ్రంగా గాయపరిచింది. ద్విచక్ర వాహనంలో వెళుతున్న ఉమాపతి, వంశీ అనే ఇద్దరి యువకులపై దాడి చేసింది. వంశీ ఏనుగు దాడి నుంచి తప్పించుకోగా...ఉమాపతిని తీవ్రంగా గాయపరిచింది. దీంతో స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు చెప్పినట్లు కుటుంబ సభ్యుల తెలిపారు. ఒంటరి ఏనుగును కట్టడి చేసేందుకు అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. దీనిపై మండలంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ఆ 9.. మాకే కావాలి!

- 'గీత' కార్మికుల దుకాణాలపై కన్ను
- కూటమి నేతల బెదిరింపులు
- దారికి రాకుంటే.. మద్యం దుకాణాలకు తాళాలు
- గీత కార్మికుల వ్యాపారులపై ఒత్తిళ్లు



పాలసముద్రంలో కల్లుగీత మద్యం దుకాణానికి తాళాలు వేసిన దృశ్యం

చిత్తూరు అర్బన్ : ఆ చేత్తో ఇచ్చి.. ఈ చేత్తో లాక్కోవడమంటే ఇదే.. కల్లుగీత కులాలను ఆర్థికంగా ఆదుకోవడానికి మద్యం దుకాణాలు ఇచ్చినట్లు ఇచ్చిన కూటమి సర్కారు.. ఇప్పుడు ఆ పార్టీ నేతల ద్వారా వాటిని లాక్కునే ప్రయత్నం చేస్తోంది. ఒప్పుకోకుంటే ప్రజలను రెచ్చగొట్టి, తమ గ్రామంలో మద్యం దుకాణం వద్దంటూ ధర్నా చేయించి.. తాళాలు వేయిస్తున్నారు. జిల్లాలో 102 మద్యం దుకాణాలుంటే వీటిలో పదిశాతం కల్లుగీత సామాజిక వర్గాలకు కేటాయిస్తూ ప్రభుత్వం టెండర్లు నిర్వహించింది. చిత్తూరు నగరంతో పాటు నగరి, పలమనేరు, పుంగనూరు మున్సిపాలిటీలు, చిత్తూరు రూరల్, గుడుపల్లె, వి.కోట మండలాల్లోని మద్యం దుకాణాలు లాటరీ ద్వారా ఈడిగ సామాజిక వర్గానికి, పాలసముద్రం గౌడ, వెదురుకుప్పంలో గౌడ్ కులాలు ఒక్కో దుకాణం దక్కించుకున్నాయి. పెద్దపంజాణి మండలంలో గౌండ్ల సామాజిక వర్గంకు కేటాయించిన దుకాణానికి ఆ కులం కాని వ్యక్తి దరఖాస్తు చేయడంతో దాన్ని రద్దు చేశారు.

ఆర్థిక పురోభివృద్ధికి ..

తొమ్మిది మద్యం దుకాణాలను కల్లుగీత సామాజిక వర్గాలకు చెందిన వ్యాపారులు గతనెల 10వ తేదీ నుంచి వ్యాపారాలు ప్రారంభించారు. అయితే అన్-రిజర్వు కేటగిరీలో ఏడాదికి రూ.65 లక్షలున్న మద్యం లైసెన్సు.. కల్లుగీత కులాల విషయానికి వచ్చేసరికి రూ.32.50 లక్షలుగా నిర్ణయిస్తూ ప్రభు త్వం అవకాశం కల్పించింది. వెనుకబడ్డ సామాజిక వర్గాల ఆర్థిక పురోభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందంటూ కూటమి ప్రభుత్వం గొప్పలు పలికింది. కానీ అక్కడి నుంచే అసలు కథ మొదలైంది.

బెదిరింపుల పర్వం..

మద్యం దుకాణాలు దక్కించుకున్న గీత కులాలకు చెందిన వ్యాపారులకు లైసెన్సు ఫీజులో 50 శాతం రాయితీ ఉండటంతో ఆయా నియోజకవర్గాల్లోని కూటమి ప్రజా ప్రతినిధుల చూపు అటు వైపు పడింది. కొన్నిచోట్ల దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులను పిలిపించిన ప్రజా ప్రతినిధులు, దుకాణాల్లో తాము ఎలాంటి పెట్టుబడి పెట్టబోమని, కానీ వచ్చే లాభాల్లో 30 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మరికొన్ని నియోజకవర్గాల్లో అసలు దుకాణమే తమకు ఇచ్చేయాలని, ఇందుకు ప్రతిఫలంగా రూ.10 లక్షలు ఇస్తామని బేరసారాలు చేస్తున్నారు. దుకాణాలు ఇవ్వబోమని చెప్పిన చోట్ల ఇప్పటికే వ్యాపారాలు చేసుకోనివ్వడంలేదు. పాలసముద్రంలో మద్యం దుకాణం వద్దంటూ స్థానికులను రెచ్చగొట్టి తాళాలు వేయించారనే ఆరోపణలు లేకపోలేదు. ఎస్ఆర్.పేటలో అసలు దుకాణం తెరవడానికే కూటమి నేత అనుమతి ఇవ్వలేదు. ఇలా గీత కులాలకు వచ్చిన తొమ్మిది దుకాణాల్లోనూ ఆయా ప్రాంతాల్లోని నేతలు వాటలు అడుగుతుండటంతో ఆ సామాజికవర్గ వ్యాపారులు నలిగిపోతున్నారు.



చిత్తూరులోని కల్లుగీత వర్గానికి వచ్చిన మద్యం దుకాణం వద్ద మూతపడిన పర్మిట్‌గది

అధికారుల అండ..

కూటమి నేతల బెదిరింపుల పర్వానికి కొందరు ఎక్సైజ్ అధికారులు దన్నుగా నిలుస్తున్నారు. తమ డిమాండ్లకు అంగీకరించిన కల్లుగీత సామాజిక వర్గాలకు చెందిన మద్యం దుకాణాల వద్ద అనధికారిక పర్మిట్ గది తీయడానికి వీల్లేదని అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఏదైనా ఉంటే కూటమి నేతలతో మాట్లాడుకోవాలని సూచిస్తున్నారు. జిల్లాలోని 102 మ ద్యం దుకాణాల వద్ద ఎవ్వరికీ పర్మిట్ గదులకు అనుమతులు లేకపోయినా.. అక్కడే మద్యం తాగిస్తున్నారు. తీరా గీత కులాలకు చెందిన తొ మ్మిది దుకాణాల వద్ద మాత్రం ఈ నిబంధన అమల్లోకి తెచ్చి, వారిని వేధింపులకు గురిచేస్తున్నారు.